క్లుప్తంగా

పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



సదుం: పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే ద్వారకనాథ రెడ్డి

సదుం: మండలంలోని ఎర్రాతివారిపల్లె సదుమమ్మ ఆలయంలో సోమవారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక అభిషేకాలు, పూజల్లో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకున్నారు. అక్టోబరు 2 వరకు ఉత్సవాలు జరుగుతాయని అర్చకులు తెలిపారు.

ప్రధాని మోదీ చిత్ర పటానికి పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న నాయకులు

కుప్పం: అన్ని వస్తువులు, సేవలపై జీఎస్టీ తగ్గించడం హర్షణీయమని బీజేపీ నాయకులు తెలిపారు. వారు సోమవారం కుప్పం బస్టాండులో ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, రెస్కో చైర్మన్ ప్రతాప్, బీజేపీ నాయకులు తులసి పాల్గొన్నారు.

వృత్తి విద్యలో నైపుణ్యం సాధించాలి



సూపర్ మార్కెట్‌లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయులు

రొంపిచెర్ల: విద్యార్థులు వృత్తి విద్యలో నైపుణ్యం సాధించాలని రొంపిచెర్ల బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం ధనలక్ష్మి తెలిపారు. దసరా సెలవుల్లో భాగంగా సోమవారం పదో తరగతి విద్యార్థులకు సమగ్ర శిక్ష, స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రిటైల్ రంగంలో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ తరగతులు ఇస్తున్నట్టు తెలిపారు. వృత్తి విద్య ఉపాధ్యాయుడు శశికుమార్ పర్యవేక్షణలో సూపర్ మార్కెట్, ఎలక్ట్రానిక్ షాపుల్లో శిక్షణ ఇచ్చారు.

కంటైనర్ బోల్తా



బంగారుపాళెం: మండలంలోని చెన్నై–బెంగళూరు జాతీయ రహదారి కొత్తపల్లె వద్ద సోమవారం తెల్లవారుజామున ఓ పార్సిల్ సర్వీసుకు చెందిన కంటైనర్ బోల్తా పడింది. డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విజయవాడ నుంచి బెంగళూరుకు పోతున్న వీఎల్ఆర్ పార్సిల్ సర్వీసు కంటైనర్ కొత్తపల్లె ఫ్లైఓవర్ సమీపంలో అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో బెంగళూరుకు చెందిన లారీ డ్రైవర్ మంజునాథ్‌కు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యథేచ్ఛగా అక్రమ వ్యాపారాలు

- సెబ్ సీజ్ చేస్తున్న వాహనాలు
- ఆన్‌లైన్‌లో కనిపించని వివరాలు
- పొంతనలేని ఛాసిస్, ఇంజిన్ నంబర్లు
- అక్రమ రవాణాలో దొంగబండ్లు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలమనేరు రెవెన్యూ డివిజన్‌లో అక్రమ వ్యాపారాలు ఊపందుకున్నాయి. ఎర్రచందనం, రేషన్ బియ్యం, మద్యం, నల్లమందు, గుండ్లు, జిలిటెన్ స్టిక్స్, దారం రవాణా జోరుగా సాగుతోంది. పుంగనూరు నుంచి పశువులను కబేళాకు తరలిస్తున్నారు. ఇందుకు స్మగ్లర్లు తమిళనాడులో కొనుగోలు చేసిన దొంగ బండ్లను వినియోగిస్తున్నారు. అధికారులు వాహనాలను స్వాధీనం చేసుకున్నా నంబర్ ప్లేట్‌కు, ఇంజిన్, ఛాసిస్ నంబర్లకు పొంతన ఉండడం లేదు. ఈ క్రమంలో ఈ వాహనాలు ఎవరివన్న విషయాన్ని అధికారులు కనుక్కోలేకపోతున్నారు.

పలమనేరు: పలమనేరు ప్రాంతం కర్ణాటక, తమిళనాడు సరిహద్దులో వుంది. ఈ క్రమంలో కొంత మంది సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో అక్రమ మార్గాలను ఎంచుకుంటున్నారు. కర్ణాటక నుంచి మద్యం తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారు. కర్ణాటక మద్యం విక్రయాలను నిలువరించేందుకు ఎక్సైజ్, సెబ్ అధికారులు నిందితులపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తున్నారు. అక్రమ రవాణాకు అలవాటు పడిన స్మగ్లర్లు ఎత్తుకు పైఎత్తు వేస్తున్నారు. తమిళనాడు నుంచి రికార్డులు లేని దొంగ బండ్లను కారు చౌకగా కొనుగోలు చేసి కర్ణాటక సరిహద్దు ప్రాంతాల నుంచి జిల్లాలోకి మద్యం తరలించడానికి వినియోగిస్తున్నారు. పోలీసులు లేదా ఎక్సైజ్ అధికారులు వాటిని సీజ్ చేసినా ప్రయోజనం లేకుండా పోతోంది.

అన్ని అక్రమాలకు ఇలాంటి వాహనాలే...

ప్రస్తుతం శేషాచలం అడవుల నుంచి ఎర్రచందనం దుంగలను దొంగ వాహనాల్లో కర్ణాటకలోని కటికనహళ్లికి తరలిస్తున్నారు. నెల్లూరు, చిత్తూరు, తమిళనాడు నుంచి కర్ణాటకకు బియ్యం, ఇసుక లారీలు అక్రమంగా వెళుతున్నాయి. కర్ణాటక నుంచి మద్యాన్ని తీసుకువస్తున్నారు. ఇందుకోసం తమిళనాడులోని పేర్నంబట్, గుడియాత్తం, వేలూరు ప్రాంతాల్లోని దొంగ వాహనాలను కారుచౌకగా కొనుగోలు చేసి ఇక్కడ వినియోగిస్తున్నట్టు తెలుస్తోంది.



పలమనేరులోని ఎస్టీ, ఎక్సైజ్ కార్యాలయాల వద్దవున్న రికార్డులు లేని వాహనాలు(ఫైల్)

వెలుగులోకి వచ్చిందిలా..

ఇటీవల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) అధికారులు, ఎక్సైజ్ మొబైల్ పార్టీ, ఎక్సైజ్ పోలీసులు, బోర్డర్ ఎక్సైజ్ పార్టీలు జిల్లా అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో కర్ణాటక మద్యాన్ని పట్టుకున్నారు. ఇందుకు వినియోగించిన కార్లు, ద్విచక్ర వాహనాలను పరిశీలిస్తే వాటి ఆర్సీ, నంబర్లు ఆన్‌లైన్‌లో కనిపించలేదు. కొన్నింటికి ఇంజిన్, ఛాసిస్ నంబర్లు లేవు. ఉన్న వాటి నంబర్ ప్లేట్‌కు, ఛాసిస్, ఇంజిన్ నంబర్లకు పొంతన లేదు.

దొంగ బండ్లకు అడ్డా పేర్నంబట్

తమిళనాడు రాష్ట్రంలోని పేర్నంబట్ దొంగ వాహనాలకు అడ్డాగా మారింది. కర్ణాటక, తమిళనాడు సరిహద్దు ప్రాంతాల్లోని దొంగ వాహనాలను కొనే ముఠా పేర్నంబట్‌లో కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్టు సమాచారం. గతంలో ఎర్రచందనం అక్రమరవాణాకు స్మగ్లర్లు పేర్నంబట్ నుంచే వాహనాలను కొని ఉపయోగించినట్టు తెలిసింది. అక్కడ రికార్డులు లేని వాహనాలు చాలా తక్కువ ధరకు దొరుకుతాయి. దీంతో కర్ణాటక సరిహద్దుకు అనుకుని స్మగ్లింగ్ చేసే వారు ఎక్కువగా రికార్డులు లేని వాహనాలను వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో రవాణా, పోలీసు అధికారులు తరచూ తనిఖీలు చేపట్టి రికార్డులు లేని వాహనాలను గుర్తించాల్సి ఉంది. రికార్డులు లేని వాహనాలు ఎక్కడి నుంచి వస్తున్నాయనే విషయం తెలుసుకోవాలి. దీనిపై స్థానిక సెబ్ సీఐ సురేష్ రెడ్డిని వివరణ కోరగా అక్రమార్కులు అక్రమ రవాణాకు రికార్డులు లేని వాహనాలను ఎక్కువగా వాడుతుంటారని తెలిపారు. వీటిని ఏ శాఖ అధికారులు పట్టుకున్నా వారికి నష్టం లేకుండా ప్లాన్ చేస్తుంటారని పేర్కొన్నారు. తాము స్వాధీనం చేసుకున్న వాహనాలను ఆర్టీవోలకు పంపి వారి వివరాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వీఆర్ఏలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి



బొప్పరాజు వెంకటేశ్వర్లును కలిసిన లక్ష్మణ్

రొంపిచెర్ల: వీఆర్ఏలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని వీఆర్ఏల యూనియన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ యామల లక్ష్మణ్ కోరారు. ఆయన సోమవారం ఏపీజేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లును కలిసి వీఆర్ఏల సమస్యలు వివరించారు. ఎన్నికల సమయంలో నారా లోకేష్ వీఆర్ఏల జీతాలు పెంచుతామని, అర్హులైన వారికి ప్రమోషన్ ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 17 నెలలు అవుతున్నా హామీ గురించి పట్టించుకోక పోవడం తగదన్నారు. ఏళ్ల తరబడి నామినీలుగా పనిచేస్తున్న తమను రెగ్యులర్ వీఆర్ఏలుగా గుర్తించాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

సదుం: మండలంలో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో రాధారాణి ఆదేశించారు. ఆమె సోమవారం అధికారులతో గృహాలు, మరుగుదొడ్ల నిర్మాణాలపై సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులకు మంజూరైన గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఏఈ ప్రణయ్‌కుమార్‌ను ఆదేశించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ లక్ష్యాలు చేరుకునేలా కృషి చేయాలని పేర్కొన్నారు. పీఆర్ ఏఈ ఆదినారాయణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విజయభాస్కర్ రెడ్డి మృతి తీరనిలోటు



విజయభాస్కర్‌రెడ్డికి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీ రెడ్డప్ప

పుంగనూరు: వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సర్పంచ్ చదళ్ల విజయభాస్కర్‌రెడ్డి(61) మృతికి పార్టీకి తీరని లోటని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. విజయ భాస్కర్ రెడ్డి ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. ఈ విషయం తెలిసిన వెంటనే పెద్దిరెడ్డి, చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప, పీకేఎం ముడా మాజీ చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అలీం బాషా చదళ్లకు చేరుకున్నారు. ఆయన భౌతికదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. సాయంత్రం అశ్రు నయనాల నడుమ కన్నీటి వీడ్కోలు పలికారు. సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జి ఫకృద్దీన్ షరీఫ్, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ అమ్ము, పార్టీ జిల్లా కార్యదర్శులు దేవదొడ్డి ప్రభాకర్‌రెడ్డి, చంద్రారెడ్డి యాదవ్, మండల అధ్యక్షుడు అమరనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీలు కీలకంగా పనిచేయాలి





మాజీ మంత్రి పెద్దిరెడ్డికి గ్రామ కమిటీ వివరాలు అందజేస్తున్న జెడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి, పులిచెర్ల నేతలు

సదుం: వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీలు కీలకంగా పనిచేసేలా నాయకులు చర్యలు తీసుకోవాలని పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. ఆయనను సోమవారం తిరుపతిలోని క్యాంపు కార్యాలయంలో జెడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి కలిశారు. గ్రామ కమిటీల వివరాలు అందజేశారు. త్వరలోనే కమిటీలు ఖరారు కానున్నట్లు వారు తెలిపారు. కమిటీల సభ్యులు ప్రతి ఇంటికీ వెళ్లి పార్టీ కార్యక్రమాలను వివరించాల్సి వుంటుందని తెలిపారు. కార్యక్రమంలో కల్యాణ భరత్, గురు రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

గ్రామ కమిటీల ఏర్పాటు పూర్తి

పులిచెర్ల(కల్లూరు): పులిచెర్ల మండలంలోని 25 పంచాయతీల్లో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీలు ఏర్పాటు చేసినట్లు ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, కన్వీనర్ నాదమునిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముర్వత్‌బాషా తెలిపారు. మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్వగృహంలో సోమవారం కమిటీల జాబితాను అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వజ్ర భాస్కరరెడ్డి, రెడ్డీశ్వరరెడ్డి, హేమసుందరరెడ్డి, మిద్దింటి కిషోర్, చంద్రశేఖరరెడ్డి, దాము, జాఫర్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పలమనేరులో లోక్ కళ్యాణ్ మేళా

పలమనేరు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మంగవారం లోక్ కళ్యాణ్ మేళా కార్యక్రమం నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి తెలిపారు. ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణంలోని వీధి విక్రయదారులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇచ్చేందుకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలిపారు. పలు బ్యాంకులకు చెందిన అధికారులు హాజరై దరఖాస్తులు స్వీకరిస్తారని వెల్లడించారు. అదేవిధంగా ఉచిత వైద్యం శిబిరం నిర్వహించి వీధి విక్రయదారులు, వారి కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు చేయించనున్నట్టు తెలిపారు.

రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో పలమనేరు విద్యార్థుల ప్రతిభ



కరాటేలో ప్రతిభ చూపిన పలమనేరు విద్యార్థులు

పలమనేరు: హైదరాబాద్‌లో రెండు రోజుల క్రితం జరిగిన సౌత్ ఇండియా కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పలమనేరు పట్టణానికి చెందిన లావణ్య, వర్షితకృష్ణ, సేవాహర్ష, హేమంత్, ముర్తుజా, మతీన్‌బేగ్, హైదర్ ప్రతిభ చూపినట్టు కరాటే మాస్టర్ వంశీ సోమవారం తెలిపారు. వారికి సినీనటుడు సుమన్ బహుమతులు అందజేశారని పేర్కొన్నారు.

జిల్లా జడ్జిని కలిసిన ఎస్పీ



చిత్తూరు అర్బన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారికను చిత్తూరు ఎస్పీ తుషార్ డూడీ మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల జరిగిన ఐపీఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా చిత్తూరుకు వచ్చిన డూడీ.. జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పెండింగ్ కేసుల పరిష్కారంలో పోలీసుశాఖ చొరవ చూపాలని జడ్జి ఆదేశించారు.

మహిళలు ఆరోగ్యంగా ఉండాలి



రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి మురళి

రొంపిచెర్ల: మహిళలు ఆరోగ్యంగా ఉంటే కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని పీహెచ్‌సీ డాక్టర్లు దినేష్ కుమార్ నాయక్, వినయ్ తెలిపారు. రొంపిచెర్ల పీహెచ్‌సీలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించి 200మంది మహిళలకు రొమ్ము, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్, నోటి క్యాన్సర్, చిన్న పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో వైద్యులు ప్రసాద్‌రాజు, షఫీ, పుష్పకుమారి, అజిత, హెల్త్ ఎడ్యుకేటర్ రాజేశ్వరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష, హెల్త్ సూపర్‌వైజర్ పంకజ పాల్గొన్నారు.

మహిళల సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యం

పెద్దపంజాణి: మహిళలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడమే స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం లక్ష్యమని పెద్దపంజాణి, రాయలపేట పీహెచ్‌సీల వైద్యాధికారులు మురళి, మాధవి తెలిపారు. వారు సోమవారం శంకర్రాయలపేట, పెద్దకాప్పల్లి గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. మహిళలకు పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పులిచెర్ల(కల్లూరు): పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని కొమ్మిరెడ్డిగారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆకు కూరలు, పాలు, పండ్లు తీసు కోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ యల్లయ్య, రమ్యశ్రీ పాల్గొన్నారు.



రొంపిచెర్ల పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

దోబీఘాట్ అభివృద్ధికి నిధులు ఇవ్వాలని వినతి



ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న రజకులు

రొంపిచెర్ల: రొంపిచెర్ల పంచాయతీ నగిరి మడుగువారిపల్లెలోని దోబీఘాట్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని రజకులు కోరారు. వారు సోమవారం ఎంపీడీవో రెడ్డెప్పఆచారిని కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గతంలో దోబీఘాట్‌కు గ్రామ లెక్కదాఖలా సర్వే నంబరు 1041లో వున్న 40 సెంట్ల భూమిని కేటాయించారని తెలిపారు. అందులో బోరు వేసుకుని మోటార్ కూడా ఏర్పాటుచేసుకున్నట్టు తెలిపారు బిగించామని తెలిపారు. ప్రస్తుతం అవి మరమ్మతులకు గురయ్యాయని వాపోయారు. ఉతికిన బట్టలను ఆరబెట్టుకునేందుకు షెడ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. అలాగే తహసీల్దార్ అమరనాథ్‌ను కలిసి దోబీఘాట్‌కు ఇచ్చిన స్థలం ఆక్రమణ అవుతోందని ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.వి.రమణ, గుర్రప్ప, సుబ్రమణ్యం, హరినాథ, వెంకటరత్నం, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.













బైరెడ్డిపల్లె: బాలా త్రిపుర సుందరిగా సల్లాపురెమ్మ, స్వర్ణకవచ అలంకరణలో బాటగంగమ్మ, బాలాత్రిపుర సుందరిగా కాళికా దేవి, పుంగనూరు: వాసవీ మాతకు గాజుల అలంకరణ, సదుం: ప్రత్యేకాంకరణలో గంగాపురెమ్మ, విరూపాక్షిగా మారెమ్మ

మొరవలు పారుతున్న చెరువులు



మొరవపోతున్న అయ్యవాని చెరువు

సదుం: మండలంలో కొద్ది రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. ఈ క్రమంలో పలు ప్రాజెక్టులు నిండి మొరవపోతున్నాయి. గార్గేయనదిలో ఉద్ధృతంగా నీరు ప్రవహిస్తోంది. ఆ నీటితో పలు చెరువులు, కుంటలు నిండుతున్నాయి. సోమవారం నుంచి చెరుకువారిపల్లె అయ్యవాని చెరువు నిండి మొరవపోతున్నట్లు గ్రామస్తులు తెలిపారు. చెరువులు నిండడంతో భూగర్భ జలాలు నిండి ఈ ఏడాది పంటలకు సాగునీటి కొరత వుండదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కరుణించు మాత శైలపుత్రీ



వి.కోట: బాలా త్రిపుర సుందరిగా దుర్గామాత



వి.కోట: పట్టువస్త్రాలు తీసుకువస్తున్న ఆలయ కమిటీ చైర్మన్



బంగారు చీర అలంకరణలో వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు

పెద్దపంజాణి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని శివాడిలో వెలసిన కాళికాదేవి అమ్మవారు సోమ వారం బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ప్రభాకర్ కుటుంబ సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం వెంకటరెడ్డి, శీనురెడ్డి, నాగరాజ రెడ్డి, నంజుండ గౌడు ఉభయదారులుగా వ్యవహరించి భక్తులకు అన్నదానం చేశారు.

వి.కోటలో..

వి.కోట: పట్టణంలోని దుర్గానగర్‌లో వున్న దుర్గామాత ఆలయంలో సోమవారం నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారిని బాలా త్రిపుర సుందరిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ కమిటీ చైర్మన్ దామోదార రెడ్డి పట్టువస్త్రాలను ఊరేగింపుగా తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు. సాయంత్రం అమ్మవారికి ఊంజల్ సేవ చేశారు. అలాగే కేవీపీధిలో వున్న కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

సదుంలో..

సదుం: మండలంలోని పచ్చార్లమాకులపల్లెలో వున్న గంగాపురెమ్మ ఆలయంలో అమ్మవారికి ధర్మకర్త, వైఎస్సార్ సీపీ నాయకుడు రెడ్డెప్ప రెడ్డి కలశ పూజ, అభిషేకాలు చేశారు. సదుంలోని చదుమమ్మ ఆలయంలో ఎల్లమ్మ రజక సంఘం ఆధ్వర్యంలో ధ్వజారోహణం, పూజలు చేశారు. జాంద్రపేట రామలింగ చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు బాలాత్రిపుర అలంకారంలో దర్శనమిచ్చారు.

పుంగనూరులో..

పుంగనూరు: పట్టణంలోని పలు ఆలయాల్లో సోమవారం దేవీ శరన్నవరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారిని బంగారు చీరతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. గాజుల హారం వేశారు. భోగ నుంజుడేశ్వర స్వామి ఆలయంలో పార్వతీదేవిని బాలా త్రిపుర సుందరీ దేవిగా అలంకరించారు. వీరూపాక్షి మారెమ్మకు ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. వాసవీదేవి ఆలయంలో కార్యక్రమాలను ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బాలసుబ్రమణ్యం పర్యవేక్షించారు.

బాలా త్రిపుర సుందరిగా సల్లాపురెమ్మ

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె ఎస్సీ కాలనీలో వున్న సల్లాపురెమ్మ సోమవారం బాలా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. బయప్ప కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. అదేవిధంగా బైరెడ్డిపల్లెలో వున్న బాటగంగమ్మ అమ్మవారు స్వర్ణకవచ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.